క్లుప్తంగా

నేడు కలికిరిలో ఎమ్మెల్యే పర్యటన

కలికిరి: మండలంలోని చీకటిపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, వాటర్ ప్లాంట్ తదితర అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరవ్వాలని ఆయన కోరారు.

పన్ను చెల్లించి రాయితీ పొందండి

బి.కొత్తకోట: నగర పంచాయతీలో ప్రజలు చెల్లించాల్సిన పాత పన్ను బకాయిలు, ప్రస్తుత బకాయిలపై వడ్డీ మాఫీ చేసిందని స్థానిక తాకాటంవారిపల్లె సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం వడ్డీ మాఫీ బ్యానర్లతో ప్రదర్శన నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. పన్నులపైనే కాకుండా ఖాళీ స్థలాల పన్నులపై వడ్డీ మాఫీ అవుతుందని ప్రచారం చేశారు. మేనేజర్ రమాదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ మౌలా, ఆర్ఐ శ్రీనివాసులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కిరణ్ కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

తంబళ్లపల్లె: ఉపాధి పనుల్లో ఎక్కువ మంది కూలీలు పాల్గొనేలా సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మూలపల్లె వద్ద ఉపాధి కూలీలు చేస్తున్న ఫాంఫండ్‌ను పరిశీలించారు. ఉద్యాన వనశాఖ ద్వారా రైతులు పెట్టిన మామిడి మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలు కోరిన వెంటనే పనులు చూపాలన్నారు. జరిగిన పనులకు సకాలంలో కొలతలు తీసి బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపడితే ఎక్కువ మంది కూలీలు వస్తారన్నారు. ఏపీవో అంజనప్ప, ఉపాధి ఇంజనీర్ రామన్న, ఫీల్డ్ అసిస్టెంట్ వేమనారాయణలు ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ సందర్శన

పీలేరు : స్థానిక ఎంజేఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న ఈఈఈ, మెకానికల్ విద్యార్థులు అకాడమిక్స్‌లో భాగంగా మంగళవారం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. సబ్‌స్టేషన్‌లో పరికరాల పనితీరును అసిస్టెంట్ ఇంజనీర్ రాంప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అవినాష్‌రెడ్డి, డాక్టర్ ఎస్. సుధాకర్‌రెడ్డి, డాక్టర్ రెడ్డిఖాసీం, సుహేల్, భరత్, బాలాజి, కల్పన, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత


సుబ్బరాయుడుకు పింఛన్ అందిస్తున్న గ్రామ వలంటీరు అస్లాం

కేవీపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న పింఛన్ లబ్ధిదారునికి అక్కడికి వెళ్లి పింఛన్ అందజేసి గ్రామ వలంటీర్ శభాష్ అనిపించుకున్నాడు. మండలంలోని వగల్లకు చెందిన సుబ్బరాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కొద్దిరోజులుగా తిరుపతి బర్డ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ అస్లాం ఈ నెల ఇవ్వాల్సిన పింఛన్‌ను మంగళవారం తిరుపతికి వెళ్లి లబ్ధిదారునికి అందజేశాడు. దీంతో ఆయన వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపాడు.

నాటు సారా స్వాధీనం

రామసముద్రం: రామసముద్రం మండలం మానేవారిపలెల పంచాయతీ చీమనపల్లి మిట్టక్రాస్‌లో సోమవారం సాయంత్రం ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా 82 బస్తాల బెల్లం, 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ప్యాసింజర్ ఆటోలో ఇద్దరు వ్యక్తులు 10 మూటల నల్లబెల్లం, 10 లీటర్ల నాటు సారాను తీసుకెళుతుండగా గుర్తించామన్నారు. పత్రపల్లితండాకు చెందిన ఈశ్వర్‌నాయక్, అతని భార్య అమరావతిని అరెస్టు చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని శ్రీ ప్రసన్న పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి , పి.శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ 7న అంకురార్పణ, ధ్వజావరోహణం, కలశ ప్రతిష్ఠ, 8న కల్యాణోత్సవం, 9న స్వామివారి బ్రహ్మ రథోత్సవం, 10న పార్వేటోత్సవం, టీటీడీ అన్నమాచార్య ట్రస్టు ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు, 11న వసంతోత్సవం, శయనోత్సవం, 12న స్వామి వారి విశ్వరూప దర్శన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి


ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ నాయకులు

ములకలచెరువు: ప్రజా సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి రాష్ట్ర సీఎంగా ఆశీర్వదించాలని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని వేపూరికోట, పాత ములకలచెరువు పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలంతా ఎమ్మెల్యేను అడుగడుగునా ఘనంగా స్వాగతం పలికారు. ప్రజా సమస్యలను ఆలకిస్తూ వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తూ సుపరిపాలన అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు పెట్టే ప్రలోభాలకు మోసపోరాదని హితవు పలికారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల్లో వందల హామీలిచ్చి వాటిని నెరవేర్చకుండా ఓటర్లను నిలువునా ముంచారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ హయాంలో మహిళలకు అన్ని సంక్షేమ పథకాల్లో పెద్దపీట వేశారన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ప్రజలంతా జగనన్నను గెలిపిస్తే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు యథావిధిగా అందుతాయన్నారు. అనంతరం ఉమాశంకర్ కాలనీలో అర్హులై లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన వెంట ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ మాధవరెడ్డి, సర్పంచ్‌లు సునీత, మంజుల, ఎంపీటీసీలు రేష్మా, ఆయిషా, నాయకులు సుదర్శన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, దిన్నిపాటి రవీంద్రారెడ్డి, సిద్ధారెడ్డి, రామిరెడ్డి, మద్దిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రామనాథం, దేవేంద్ర, సులేమాన్, రఫితో పాటు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

వేపూరికోట పంచాయతీ ఆర్ఎస్ కొత్తపల్లి, ఎద్దులవారిపల్లి గ్రామాలకు చెందిన 10 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. జల్లా వేమనారాయణ, ఆదిమూర్తి, శంకర్ నారాయణ, జయరాం, మోహన్, రహ్మతుల్లా, మహమ్మద్, చంద్ర, వినయ్‌లకు ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా వేశారు.

రైతుల ఇంటిస్థలాలపైనా టీడీపీ ఏడుపే..!

- గతంలోనూ లేఅవుట్‌లపై కోర్టును ఆశ్రయించిన టీడీపీ
- టీడీపీ నేతల తీరుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహం

కలికిరి: వాళ్లు ఇవ్వరు.. ఇచ్చే వారిని ఇవ్వనివ్వరు అన్న చందంగా తయారైంది నియోజకవర్గంలో టీడీపీ తీరు. గత టీడీపీ ప్రభుత్వ హాయంలో మండలంలో కనీసం ఒక లేఅవుట్ వేసి పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చిన పాపాన పోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మండలంలోని సుమారు 5 వేల మంది పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని పేదలకు మదనపల్లి రోడ్డు ఏపిఐఐసి భూములలో రెవెన్యూ అధికారులు గతంలో లౌఅవుట్ ఏర్పాటు చేశారు. టీడీపీ నేతలు పేదలకు ఇంటి స్థలాలు దక్కకుండా కోర్టును ఆశ్రయించారు. దీంతో పేదలకు మరోచోట ఇంటి స్థలాల కేటాయించాల్సి వచ్చింది. ప్రస్తుతం కలికిరి పంచాయతీ పరిధిలోని నగ్రావాండ్లపల్లి రైతులు జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, బాలికల రెషిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు గతంలో భూములిచ్చారు. గ్రామం సమీపం తాటిగుంటపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ప్రతి ఏటా సంక్రాంతి ఉత్సవం జరుపుకుంటున్న స్థలం సమీపంలో తమకు ఇంటి పట్టాల కోసం గ్రామస్తులు ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లకు విన్నవించారు. నగ్రావాండ్లపల్లి రైతులకు ప్రభుత్వ స్థలంలో ఇంటి స్థలాల మంజూరుకు ఎంపీ, ఎమ్మెల్యేలు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదికలను పంపారు. ఈ క్రమంలో స్థలంలోని ముళ్ల పొదలను తొలగించడానికి నగ్రావాండ్లపల్లి రైతులు జేసీబీ సాయంతో పనులు చేపట్టారు. ఇది గమనించిన పక్కనే ఉన్న బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఆట స్థలం కోసం కళాశాలకు స్థలం కావాలని జేసీబీని అడ్డుకున్నారు. వాస్తవానికి ప్రభుత్వం కళాశాలకు కేటాయించిన స్థలం వరకు ప్రహరీ ఉంది. సమాచారం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిశోర్ రెడ్డి కళాశాల వద్దకు చేరుకుని ఎంపీ, ఎమ్మెల్యేలపై విమర్శలు గుప్పించి రైతుల ఇంటి స్థలాలపై రాజకీయ రంగు పులమడంతో రైతులలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. రాజకీయంగా ఎదుర్కోలేకనే టీడీపీ నేతలు ఈ విధంగా ఎంపీ, ఎమ్మెల్యేలపై బురదచల్లుతున్నారని స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

సెక్టోరియల్ అధికారులదే పూర్తి బాధ్యత

- ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలి
- ఆర్డీఓ హరిప్రసాద్


మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

మదనపల్లె : త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు సెక్టోరియల్ అధికారులదే పూర్తి బాధ్యతని ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. ఎన్నికలకు సంబంధించి సెక్టోరియల్ ఆఫీసర్ల సంసిద్ధతలో భాగంగా మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ.. 164–మదనపల్లె అసెంబ్లీనియోజకవర్గం, 24–పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 38 సెక్టోరియల్ అధికారులను నియమించామన్నారు. వీరందరికీ పోలింగ్‌విధులపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితిపై ఫొటోలు తీసి సమర్పించాలని ఆదేశించారు. సెక్టార్, పోలీస్ అధికారులు కలిసి రూట్‌మ్యాప్‌లు తయారుచేసి అందజేయాలని తెలిపారు. ఓటుహక్కు ఉన్న ప్రతిపౌరుడు నిర్భయంగా ఓటు వేసే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలని ఆర్డీఓ తెలిపారు. సెక్టోరియల్ అధికారులకు మేజిస్ట్రేట్ పవర్‌ను ఎన్నికల కమిషన్ కల్పించినట్లు చెప్పారు. అన్నమయ్యజిల్లా ఏర్పాటయ్యాక జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికలని, ప్రశాంతంగా జరిగేలా సెక్టోరియల్ అధికారులు కృషిచేయాలని సూచించారు. ఎలక్షన్ కమిషన్ రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను పూర్తిస్థాయిలో చదివి పక్కాగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచేంతవరకు సెక్టార్ అధికారులదే పూర్తి బాధ్యతని తెలిపారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు స్ట్రాంగ్‌రూమ్‌లు వేర్వేరుగా ఉంటాయని తెలిపారు. ఈవీఎంలు నాలుగు కేటగిరీలుగా ఉంటాయని, ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు, మైక్రో అబ్జర్వర్లు ఉంటారని చెప్పారు. ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధం కావాలని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై రెవెన్యూ, పోలీసు సిబ్బంది దృష్టి సారించాలని, ఏ విధమైన ఘర్షణలకు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవీఎంల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి


మాట్లాడుతున్న డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : పీలేరులో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని జిల్లా పంచాయతీ రాజ్ అభివృద్ధి సలహామండలి సభ్యులు డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక పెద్దమసీదు వీధిలో ముస్లిం మైనారిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014, 2019లో వైఎస్సార్ సీపీకి మంచి మెజారిటీ లభించిందని, 2024 ఎన్నికల్లో కూడా రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని కానుకగా ఇవ్వాలన్నారు. పీలేరులో వంద పడకల ఆస్పత్రి, 15 వేల ఇళ్లు, రిజిస్ట్రేషన్లు, పార్కులు, అన్ని మతాలకు వేర్వేరుగా స్మశాన స్థలాలు, పట్టణంలో 44 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇబ్రహీం, వార్డు మెంబర్లు అబీద్, పరమేష్, రమణ, షాజహాన్, నాయకులు గడిబాషా, మునీర్, మసూద్, బోడేషా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలి

- తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు
- ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ జి. శ్రీనివాసులు


స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పెద్దమండ్యం: సాధారణ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలి. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన జెడ్పీ చైర్మన్‌కు ఎంపీపీ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. ఈ ఎన్నికలలో మరింత మెజార్టీ వచ్చేలా చూడాలని ఆయన పిలుపు నిచ్చారు. అలాగే రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అత్యధిక మెజార్టితో గెలిపించాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా చేరవేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మండలంలో వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే వెంటనే సంబంధిత అధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపాలని ఆయన ప్రజాప్రతినిదులకు సూచించారు. కొత్తగా బోర్లు, మోటార్లు, పైపులు అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలలో ట్యాంక్‌ల ద్వారా సరఫరా చేసిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు జెడ్పీ చైర్మన్‌కు తెలిపారు. ఈ విషయమై ఉమ్మడి చిత్తురు జిల్లా, అన్నమయ్య జిల్లాల ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా పరిషత్ నిధులలో తంబళ్లపల్లె నియోజకవర్గానికి రూ. 4.5 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో పెద్దమండ్యం మండలానికే రూ. 42 లక్షలు కేటాయించిటన్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, వైస్ ఎంపీపీ గుర్రం శారదమ్మ, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, సర్పంచ్‌లు జింకా విశ్వనాథ, పీరాన్‌బీ, సోదనపల్లె బాషా, మొలక బయ్యారెడ్డి, పద్మావతమ్మ, ఎంపీటీసీ సభ్యులు మంచూరి జయారం, బోడిమాని గీత, మాజీ సర్పంచ్ నజీర్‌అహ్మద్, నాయకులు కోనూరి రామక్రిష్ణ, గుర్రం రామచంద్ర, తిరుపాల్‌నాయక్, కేశవ లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

నిమ్మనపల్లె : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మైథిలి, సీడీసీఎల్ఆర్‌సీ చందన అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ మేట్లకు, పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులు చేర్పులపై, సాంకేతిక మార్పులు, కొత్తరకం పనుల వివరాలు, ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ వినియోగం తదితర అంశాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏపీవో రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఉపాధి హామీ కూలీలు పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి పలు రకాల మార్పులను తీసుకురావడం జరిగిందన్నారు. పనుల వివరాలు, కూలీల హాజరు, పనుల గుర్తింపు వంటి అంశాలను పొందుపరిచేందుకు పథకంలో సాంకేతిక మార్పులు జరిగాయన్నారు . పథకం ద్వారా కొత్తగా చేపట్టిబోయే పనుల పైన అవగాహన కల్పించారు . జాబ్ కార్డు కలిగిన కూలీలు ప్రతి ఒక్కరూ నూరు శాతం పని దినాలను ఉపయోగించుకోవాలన్నారు.

నేలమల్లేశ్వరస్వామి తిరునాలకు పటిష్ట ఏర్పాట్లు


మహాశివరాత్రి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దేవదాయశాఖ అధికారులు, నాయకులు

నిమ్మనపల్లె : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తవళం నేల మల్లేశ్వర స్వామి తిరునాలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ మంజుల తెలిపారు. మంగళవారం ఆలయం వద్ద వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీపీ నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రెడ్డి, మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్ కే సదాశివరెడ్డి, గార బురుజు రమణారెడ్డి, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులతో కలిసి మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమాలోచనలు చేశారు. ఆలయం వద్ద తీసుకోవలసిన భద్రతా చర్యలు, వాహనాల పార్కింగ్, తిరునాల దుకాణల ఏర్పాటు, భక్తులకు స్వామివారి దర్శన ఏర్పాట్లపై చర్చించారు. తిరునాల ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 8, 9, తేదీలలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి శివ పార్వతుల కళ్యాణం, నాట్య ప్రదర్శన ఉంటుందని, భక్తులు జాగారం చేస్తారని అన్నారు. పెద్ద ఎత్తున ఉత్సవాలకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున స్వామి వారి దర్శన ఏర్పాట్లను పటిష్టంగా చేస్తున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యం కోసం మదనపల్లె, నిమ్మనపల్లె, తవళం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు చెప్పారు. ఆలయం వద్దకు ప్రైవేటు ఆటోలను రెండు రోజులపాటు నిషేధిస్తున్నట్లు తెలిపారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం


రామ్మోహన్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

పీలేరు రూరల్ : ఆర్టీసీ కార్మికుల సమస్యలపై నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) నిరంతర పోరాటం సాగిస్తోందని యూనియన్ జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం. రాజు అన్నారు. మంగళవారం స్థానిక డిపో ప్రాంగణంలో ఎన్ఎంయూ వ్యవస్థాపక అధ్యక్షులు పి. రామ్మోహన్‌రావు 19వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం కార్మికులకు, పేదలకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంయూ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి సి.వి. రమణ, నాయకులు నాగరాజ, సుబ్బరామయ్య, ఖాజాపీర్, హరినాథ, బి.ఆర్.బి. నాయక్, ఎం.హెచ్. నాయుడు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


ప్రచారం చేస్తున్న చింతల శివానంద రెడ్డి

వాల్మీకిపురం: సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ జెడ్పీటీసీ చింతల శివానంద రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కుమ్మరవీధి, నాయక్‌వీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధితో జనం జగనన్న వెంటే నిలుస్తున్నారని ప్రతిపక్షాలకు అర్థమైందన్నారు. ఎన్నికల తరువాత మూటా ముల్లె సర్దుకోవాలన్నారు. తాను ఇంటింటికి వెళ్లి పరిచయం చేసుకొంటున్న సమయంలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ లబ్ధిపొందినట్లు చెప్పడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేశవ రెడ్డి, మహబూబ్‌బాషా, అబ్దుల్ కలీమ్, షాహెద్, సాధిక్, అలి, ఖదీర్, సైపుల్లా, చికెన్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మహాశివరాత్రి పురస్కరించుకుని తంబళ్లపల్లె మల్లయ్యకొండ, అంగళ్లు సమీపంలోని మల్లయ్యకొండలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండ కిందకు 18 బస్సులు, బి.కొత్తకోట నుంచి మల్లయ్యకొండ కిందకు రెండు బస్సులు, పెద్దమండ్యం మల్లయ్యకొండ కిందకు రెండు బస్సులు, ములకలచెరువు నుంచి రెండు బస్సులు, తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి 8 బస్సులు, మల్లయ్యకొండ కిందకు, పైకి 40 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అలాగే మదనపల్లె నుంచి తిమ్మమ్మ మర్రిమానుకు మూడు బస్సులు నడపనున్నట్లు తెలిపారు.

చింత చెట్టుకు నిప్పు


కాలుతున్న చింతచెట్టు

బి.కొత్తకోట: మండలంలోని బీరంగి గ్రామం శంకరాపురంలో మంగళవారం రాత్రి ఓ చింత వృక్షం నిలువునా కాలిపోయింది. దీనివల్ల చుట్టుపక్కల ప్రమాదం పొంచి ఉండటంతో స్పందించిన పోలీసులు అప్రమత్తమై చర్యలు తీసుకున్నారు. శంకరాపురం నుంచి కాచిపల్లెకు వెళ్లేదారిలో పెద్ద చింతచెట్టు ఉంది. దానికిందనే పేపర్ టీగ్లాసులు, చెత్తను పారబోస్తుంటారు. అక్కడ ఎవరో బీడి తాగి అగ్గిపుల్ల పడేయడంతో అది చెత్తకు అంటుకుని మంటలు చింతచెట్టుకు వ్యాపించాయి. చింతచెట్టు మొదలు తొర్ర కావడం, బాగా ఎండిపోయిన కారణంగా తొర్రకు మంటలు అంటుకుని చెట్టుపై ఎగసిపడ్డాయి. ఆ మంటలకు పక్కనే ఉన్న నివాస గృహలకు ప్రమాదం కలగకుండా సీఐ సూర్యనారాయణ అప్రమత్తం చేశారు. ములకలచెరువు నుంచి చేరుకున్న అగ్నిమాపక వాహనం మంటలను అదుపు చేసింది. ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి నష్టం వాటిల్లలేదు.

ఆయుర్వేద వైద్యులకు యంగ్ అచీవర్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆయుర్వేద వైద్యులు డాక్టర్ దివ్య, డాక్టర్ దీప్తి

మదనపల్లె : పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో ఆయుర్వేద వైద్యులైన డాక్టర్.దివ్య, డాక్టర్.దీప్తిలకు భోపాల్‌కు చెందిన విమెన్ ఆఫ్ విస్‌డమ్(వావ్) సంస్థ యంగ్ అచీవర్స్ అవార్డ్ యాజ్ బెస్ట్ విమెన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ పురస్కారాన్ని ప్రదానం చేసింది. వావ్ డాక్టర్.బబితాశర్మ కేరళ, హిమాలయ, వైద్యరత్న భోపాల్ సమైక్యంగా నిర్వహించిన పోటీల్లో దక్షిణభారతదేశం నుంచి డాక్టర్.దివ్య, డాక్టర్.దీప్తిలు ఎన్నికయ్యారన్నారు. ఐదేళ్లుగా మోకాలి,నడుము, వెన్నెముక నొప్పులకు, సోరియాసిస్ తదితర దీర్ఘవ్యాధులకు చికిత్సలందిస్తూ, మంచి గుర్తింపుపొందిన వైద్యులకు పురస్కారం దక్కడంపై పట్టణంలోని పలువురు అభినందనలు తెలిపారు.

సతీష్‌బాబుకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

మదనపల్లె సిటీ: స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ సతీస్‌బాబు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. హైదరాబాదులో మంగళవారం జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మెడికల్ ఇంజినీరింగ్ రీసెర్చ్‌సెంటర్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేశారు. సాంకేతిక విద్య పట్ల, భవిష్యత్తు ఇంజినీర్లను తయారు చేయుటలో ఆయన చేసిన కృషికి అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డును రిటైర్డు ఐఏఎస్ అధికారి చక్రపాణి అందజేశారు. ప్రిన్సిపాల్‌ను కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి, చైర్మన్ రామమోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.